ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 13.06.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. హైదరాబాద్ దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 217వ కోర్సు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌ను మంత్రి సమీక్షించారు.

2. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమం మొదలైంది.

3. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ఈ రోజుతో ముగిశాయి. మూడు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో బకాయి మొత్తాన్ని జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

4. రాబోయే రెండు రోజుల పాటు రాష్ట్రంలోని ఉత్తర , దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

**రాజ్ నాథ్ సింగ్:**

మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. హైదరాబాద్ సమీపంలోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఈరోజు జరిగిన 217వ కోర్సు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌ను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... శాస్త్ర సాంకేతికతలో వచ్చిన వృద్ధి కారణంగా యుద్ధ స్వరూపంలో గణనీయమైన మార్పులు

చోటుచేసుకున్నాయని చెప్పారు. సైనికులు , ఆయుధాలు మాత్రమే యుద్ధంలో పాల్గొనే రోజులకు కాలం చెల్లిందనీ... ప్రస్తుతం రాడార్లు , ఉపగ్రహాలు, డ్రోన్లు, రోబోటిక్ వ్యవస్థలు యుద్ధ వ్యూహంలో భాగమయ్యాయని వివరించారు. ప్రత్యర్థి దేశాల సమాచార , రవాణా, నిఘా వ్యవస్థలను నియంత్రించడం కూడా యుద్ధంలో కీలకమన్నారు. సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని , పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నూతన అధికారులకు సూచించారు. కేవలం కష్టపడి పనిచేయడమే కాకుండా, స్మార్ట్ వర్క్ కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలనీ చెబుతూ మేధో శ్రమ ప్రాముఖ్యతను వివరించారు. ఈ పరేడ్ లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుంచి శిక్షణ పొందిన తొలి మహిళా క్యాడెట్ల బృందం భారత వైమానిక దళంలో చేరింది. ఈ కార్యక్రమంలో సుఖోయ్- 30 ఎంకేఐ, సారంగ్ హెలికాప్టర్ బృందం , సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందాల వైమానిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

బైట్ – రాజ్ నాథ్ సింగ్

- MSM/RNU/ HYD

**స్వచ్ఛ పాఠశాల-సిరిసిల్ల:**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి స్వయంగా పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే తన సంకల్పమని చెప్పారు.

-పీటీసీ, సిరిసిల్ల

**స్వచ్ఛ పాఠశాల-కరీంనగర్:**

కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మన బడి - మన బాధ్యత , స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఈ రోజు నిర్వహించారు. చెత్తను తొలగించి మొక్కల పరిసరాలను , పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా పరిశుభ్రం చేశారు. ఈ

సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... మన బడి-మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పరిశుభ్రమైన వాతావరణంలో చదువుకుంటే విద్యార్థులు ఆరోగ్యం , విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆలోచనలకు అనుగుణంగా పాఠశాలల అభివృద్ధి , పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని మేయర్ తెలిపారు.

- పిటిసి, కరీంనగర్

**12 ఏళ్ల పాలన:**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని మహబూబాబాద్ జిల్లాకు చెందిన డాక్టర్ సీతారాం నాయక్ అన్నారు. ఆకాశవాణితో మాట్లాడుతూ... పేదలు , రైతులు, మహిళలు, యువత, చిన్న వ్యాపారులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు గృహాలు , ఉజ్వల యోజన ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు , రైతులకు పీఎం కిసాన్ ద్వారా ఆర్థిక సహాయం , చిన్న వ్యాపారులకు ముద్ర రుణాలు వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని పేర్కొన్నారు.

బైట్ ... డాక్టర్ సీతారాం నాయక్

- మహబూబాబాద్, పిటిసి

**సిట్రస్ సెమినార్:**

పుస్తకాలకే పరిమితమైన పరిశోధన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రయోగశాలల నుండి రైతులకు అందించి ఉత్పాదకత పెంచాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సిట్రస్ రైతుల సమస్యలు , భవిష్యత్ అవకాశాలు , ఆధునిక సాగు పద్ధతులు , శాస్త్రీయ సలహాలు, మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం వంటి అంశాలపై నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన

రాష్ట్ర స్థాయి "సిట్రస్ సెమినార్ – 2026" లో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత సంవత్సరం వరకు బత్తాయి రైతులకు ప్రత్యేకంగా ఒక వేదిక లేకపోవడం లోటుగా ఉండేదనీ , రైతుల సమస్యలను సమిష్టిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికి , రైతుల మధ్య పరస్పర సహకారం పెంపొందించడానికి ఏర్పడిన బత్తాయి రైతు పరస్పర సహాయ సహకార సంఘం మంచి ప్రయత్నమని అన్నారు.

-పీటీసీ, నల్లగొండ

**<u>షెడ్యూల్ బైట్-యోగా:</u>**

కేంద్ర ప్రభుత్వం యోగ ప్రాధాన్యతను గుర్తించి , ప్రపంచ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుండటంతో మరింత మందికి దీనిపై అవగాహన కలిగుంతోందని ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యోగ గురువు దొడ్డజి అన్నారు. ఆకాశవాణి ప్రతినిధితో యోగా ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ ఆయన ... రోజుకు గంట పాటు యోగా చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్య ఫలితాలు దక్కుతాయన్నారు.

బైట్ ... యోగ గురువు దొడ్డజి

పీటీసీ, ఆసిఫాబాద్

**<u>కొనుగోళ్లు క్లోజింగ్-ఆసిఫాబాద్:</u>**

ఆసిఫాబాద్ జిల్లాలో యాసంగి కేఎంఎస్ కింద ఏర్పాటు చేసిన 40 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ రోజుతో ముగుస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాసంగి సీజన్ లో ఇప్పటి వరకు మొత్తం 3,034 మంది రైతుల నుండి 14,962 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం క్వింటాలుకు గ్రేడ్-ఏ రకానికి రూ. 2 ,389, సాధారణ రకానికి 2 ,369 చొప్పున గరిష్ట మద్దతు ధరను రైతులకు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. మరో మూడు రోజుల్లో రైతులందరి బ్యాంకు ఖాతాల్లో వారి బకాయి మొత్తాన్ని పూర్తిగా జమ చేస్తామని చెప్పారు.

-ఆసిఫాబాద్, పీటీసీ

**కొనుగోళ్లు క్లోజింగ్-నిర్మల్:**

నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తెలిపారు. 258 సెంటర్లలో 1.77 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి గోదాములకు తరలించినట్టు వెల్లడించారు. తేమ తగులకుండా మొక్కజొన్న ధాన్యం కొనుగోలు చేసినట్టు కలెక్టర్ చెప్పారు.

-పిటిసి నిర్మల్

**వాతావరణం:**

రాబోయే రెండు రోజుల పాటు రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నిజామాబాద్ , జగిత్యాల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో ఒకవైపు నైరుతి రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తుండగా, మరికొన్ని చోట్ల తీవ్రమైన వడగాల్పులు వీస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో నల్గొండ జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పెద్దవూర మండలం , పులిచెర్లలో అత్యధికంగా 11.2 సెం.మీ.ల వర్షం కురిసింది.

-డెస్క్

**వాన భీభత్సం:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిన్న భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గంభీరావుపేట మండలంలో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలి దాటికి ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్ , తాళ్లపల్లి, పత్తి కుంటపల్లి గ్రామాల్లో కొన్ని విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

-పీటీసీ, సిరిసిల్ల

**మంత్రి పొన్నం:**

ఎల్కతుర్తి నుండి సిద్దిపేట వరకు నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి పనులను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా బీసీ , సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి పెండింగ్ పనుల పురోగతిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

- సిద్దిపేట పీటీసీ

**భట్టి పర్యటన:**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ మధ్యాహ్నం మంచిర్యాల జిల్లాలో పర్యటిస్తారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సింగరేణిలో కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ చేస్తారు.

- మంచిర్యాల, పిటిసి

**ఓటర్ల జాబితా:**

అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేసి , అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే తమ లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ 2026 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం కోరుతూ హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో నిన్న సమావేశం నిర్వహించారు.

-డెస్క్